క్లుప్తంగా

అంగన్ వాడీ కేంద్రాలకు ఫ్యాన్లు బహూకరణ

గురజాల : అంగన్‌వాడీ కేంద్రాలకు కో ఆప్షన్ సభ్యుడు షేక్ పీర్ అహ్మద్ ఫ్యాన్లు బహూకరించారు. మండల పరిధిలోని గంగవరం గ్రామంలో గల అంగన్‌వాడీ కేంద్రాలకు షేక్ మొహమ్మద్ మూసా వర్ధంతిని పురస్కరించుకుని రెండు కేంద్రాలకు ఫ్యాన్లు అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ కొమ్మినేని నారాయణమ్మ బుజ్జి, గ్రామ సర్పంచ్ బుక్కిశెట్టి వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ ఆర్ ఫణికుమార్ నాయక్, తదితరులున్నారు.

పిడుగురాళ్లల్లో వర్షం



పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణంలోని ఉదయం నుంచి రాత్రివరకు ఓ మోస్తారు వర్షం పడుతూనే ఉంది. ఇప్పటి వరకు పొలం దున్నుకుని వర్షం కోసం ఎదురు చూస్తున్న రైతులు ఆనందం వ్యక్తం చేశారు. కొంత మంది పొలం పనులు చేసి పొలం సదును చేసి పదును కోసం ఎదురు చూస్తున్న రైతులు సైతం ఈ వర్షం వల్ల లాభమే చేకూరిందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సొసైటీ మార్కెటింగ్ డైరెక్టర్‌గా భాస్కర్‌రెడ్డి



మాచర్ల రూరల్: పల్నాడు, గుంటూరు జిల్లాల కో ఆపరేటీవ్ సొసైటీ మార్కెటింగ్ డైరెక్టర్‌గా ఆరికట్ల విజయభాస్కర్‌రెడ్డి నియమితులయ్యారు. ప్రిన్సిపల్ సెక్రెటరీ చిరంజీవి నియామక ఉత్తర్వులను అందించారు. భాస్కర్‌రెడ్డి మాచర్ల మండలంలోని కంభంపాడు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు స్వర్గీయ ఆరికట్ల ఆదిరెడ్డి తనయుడు. భాస్కర్‌రెడ్డి జిల్లా వైఎస్సార్ సీపీ యువజన నాయకులుగా పార్టీ అభివృద్ధి కోసం తీవ్రంగా కృషి చేస్తున్నారు. తనకు జిల్లా స్థాయిలో కీలకమైన పదవిని అందించిన ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి, మాజీ సర్పంచ్ ఆరికట్ల చంద్రారెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పల్నాడు ప్రాంతంలోని రైతులకు సకాలంలో ఋణాలు అందించి తక్కువ వడ్డీకే బ్యాంకుల రావాల్సిన అన్నీ రకాల సదుపాయాలను కల్పించి ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

భాగస్వామ్యంతోనే డెంగ్యూ నివారణ



నరసరావుపేటరూరల్: ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ కె.శ్రీనివాసరావు తెలిపారు. డెంగ్యూ నివారణ మాసో త్సవంలో భాగంగా మండలంలోని అల్లూరివారిపాలెంలో డెంగ్యూ వ్యాధిపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న శ్రీనివాసరావు మాట్లాడుతూ దోమ పుట్టకూడదు దోమ కుట్టకూడదని తెలిపారు. పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చేస్తే దోమ పుట్టదని, దోమతెరలు, మెష్‌లు ఏర్పాటు చేసుకోవడం ద్వారా దోమలు కుట్టవని తెలిపారు. దీనిని పాటించడం ద్వారా డెంగ్యూ వ్యాధిని అరికట్టవచ్చన్నారు. జ్వరం వచ్చిన వెంటనే ఆరోగ్య సిబ్బందిని సంప్రదించాలని తెలిపారు. సమాజ భాగస్వామ్యంతోనే డెంగ్యూ వ్యాధిని నివారించడం సాధ్యమవుతుందన్నారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ ప్రసన్న ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

బీఎల్‌వోలు పారదర్శకంగా విధులు నిర్వహించాలి



శావల్యాపురం: మండలంలోని పిచికలపాలెం గ్రామంలో బీఎల్‌వోలు ఓటర్ల నమోదు సర్వే కార్యక్రమాన్ని తహసీల్దారు షేక్ జాన్‌సైదులు సోమ వారం పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు 2024 జనవరి నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పిస్తామన్నారు. ఓటర్ల సర్వే కార్యక్రమం వచ్చే నెల 21 వరకు ఇంటింటికీ బూత్ లెవల్ అధికారుల చేస్తారని, ఓటరు జాబితాలో డబుల్ ఎంట్రీలు నకిలీ ఓట్లు తొలగింపు మార్పులు చేర్పులు వందేళ్ళు వయస్సు పైబడిన వారిని గుర్తించటం, దీర్ఘకాలంగా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారి ఓట్లను గుర్తించి వారి అభీష్టం మేరకు ఏప్రాంతంలో ఉంచాలో అడిగి తెలుసుకొని అక్కడ జాబితాలో ఉంచేలా బీఎల్‌వోలు క్షేత్రస్థాయిలో విచారణ చేసి అర్హులైన వారందరికీ ఓటు హక్కు కల్పించాలన్నారు. పార్టీలకు అతీతంగా ప్రజాప్రతినిధులు సహకరించాలన్నారు. ఆయనతో పాటు డిప్యూటీ తహసీల్దారు వేముల వెంకట నాగరాజు, వీఆర్వో అమల, బీఎల్‌వో ఉన్నారు.

నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్

- నియోజక వర్గంలో రైతన్నలకు నిరంతర విద్యుత్
- రూ. 38 కోట్లతో 10 నూతన సబ్ స్టేషన్ల నిర్మాణం
- ప్రారంభానికి సిద్ధంగా ఉన్న మూడు సబ్ స్టేషన్లు
- తీరనున్న రైతన్నల విద్యుత్ కష్టాలు



గన్నవరం గ్రామంలో రూ. 3కోట్ల వ్యయంతో నిర్మాణం పూర్తి కావచ్చిన సబ్ స్టేషన్

మాచర్ల రూరల్: ఆరుగాలం శ్రమించే రైతన్న అన్ని ఒడిదుడుకులు ఎదుర్కొని పంట చేతికొచ్చేందుకు వ్యయ ప్రయాసలకోర్చే అన్నదాతలకు నాణ్యమైన నిరంతర విద్యుత్‌ను అందించేందుకు నియోజక వర్గంలో రూ. 38 కోట్లతో 33/11కెవి 10 విద్యుత్ సబ్ స్టేషన్ల నిర్మాణానికి సీఎం జగన్ ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. పల్నాటి ప్రాంతంలో వర్షాధారాల పైనే వ్యవసాయం చేస్తుంటారు. ముఖ్యంగా బోరు బావు మీద ఆధారపడి వ్యవసాయం చేసే రైతులు ఈ ప్రాంతంలో ఎక్కువగా ఉంటుంటారు. విద్యుత్ సరఫరా అవాంతరాలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి ఈ సబ్ స్టేషన్ల నిర్మాణాలతో విద్యుత్ అంతరాయాలు తొలగటమే కాకుండా జగనన్న ప్రభుత్వం అందించే 9 గంటల ఉచిత విద్యుత్ సరఫరాకు ఎంతగానో ఉపయోగపడుతుంది. దీంతో పాటు సబ్ స్టేషన్ల దూరాభారం తగ్గి విద్యుత్ సరఫరాలో తరుచూ జరుగుతున్న అవాంతరాలను తగ్గించి సకాలంలో విద్యుత్ సరఫరా అందించేందుకు ఈ ప్రతిపాదనలు ఎంతగానో దోహదపడతాయి. నియోజక



వర్గంలోని రూ. 9.50 కోట్లతో గన్నవరం, మిరియాల, జెట్టిపాలెం గ్రామాలలో 33/11 కెవి సబ్ స్టేషన్ నిర్మాణాలు పూర్తి కావచ్చి ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. వీటితో పాటు కొత్తపల్లి, చింతలతండ, పేటసన్నిగండ్ల, రచ్చమల్లపాడు, ఆత్మకూరు, రెంటాల, పట్టణంలోని సొసైటీ కాలనీ ప్రాంతాలలో ఏడు సబ్ స్టేషన్‌లు నిర్మాణానికి ప్రభుత్వం అంగీకారం తెలపటమే కాకుండా నిధులు మంజూరు చేసింది. ఎన్నో ఏళ్ళ నుంచి వ్యవసాయం విద్యుత్ బోర్ల మీదనే సాగు చేసుకునే రైతన్నలకు నూతన విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణం చేపట్టనుండటంతో అన్నదాతల పట్ల ప్రభుత్వం తమ చిత్తశుద్ధిని నిరూపించినట్లైంది. వెనుకబడిన పల్నాటి ప్రాంతంలో రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దష్టికి తీసుకువెళ్ళి నియోజక వర్గానికి రూ. 38కోట్ల నిధులు తెప్పించి 10 సబ్ స్టేషన్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టిన ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకష్ణారెడ్డి కషిని రైతన్నలు అభినందిస్తున్నారు.

రైతన్నలకు అండగా జగనన్న ప్రభుత్వం...



పల్నాటి ప్రాంతంలోని రైతన్నలు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని సీఎం జగన్ దష్టికి తీసుకెళ్ళాను. స్పందించిన ఆయన వెంటనే 33/11కెవి 10 సబ్ స్టేషన్లకు నిధులు మంజూరు చేసి రైతన్నల పక్షపాతి ప్రభుత్వంగా మరోమారు నిరూపించారు. పల్నాటి ప్రజలు సీఎం జగన్‌కు ఋణపడి ఉంటారు.

– ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకష్ణారెడ్డి

తొలగనున్న విద్యుత్ అంతరాయాలు



నియోజక వర్గంలో 33/11 కెవి 10 సబ్ స్టేషన్ల నిర్మాణాలకు నిధులు మంజూరయ్యాయి. ఇవి పూర్తి అయితే విద్యుత్ అంతరాయాలు తొలగి రైతులకు, వినియోగదారులకు నిరంతరం నాణ్యమైన విద్యుత్ సరఫరా అందిస్తాం. త్వరలో మూడు సబ్ స్టేషన్లను ప్రారంభిస్తున్నాం. వీటితో కొంత వరకు ఆ ప్రాంతాలలో సమస్యలు ఉండవు.

– విద్యుత్ డిఈ జె హరిబాబు

సమాజాన్ని మేలుకొల్పిన వ్యక్తి గుర్రం జాషువా



జాషువా విగ్రహానికి పూలమాలలు వేస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము ముక్కంటి

దాచేపల్లి : ప్రముఖ కవి గుర్రం జాషువా కవిత్వాల ద్వారా ప్రజలను చైతన్యవంతులు చేశారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి అన్నారు. బడుగు, బలహీనవర్గాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో జాషువా 53వ వర్ధంతి కార్యక్రమాన్ని సోమవారం నారాయణపురం ఆర్అండ్‌బీ బంగ్లా సెంటర్‌లో నిర్వహించారు. జాషువా విగ్రహానికి ఎమ్మెల్సీ జంగా పూలదండలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కవితల ద్వారా చైతన్యవంతులను చేసిన మహానుభావుడు జాషువా అని, జాషువా కవితలు మానవ సమాజ అభివృద్ధికి దోహదపడ్డాయని చెప్పారు. ప్రతి ఒక్కరు జాషువాను ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్సీ జంగా అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు అంబటి శేషగిరిరావు, భూషణం చెన్నయ్య, కౌన్సిలర్ షేక్ షరీఫ్, నాయకులు గద్దల వేదమణి, ముశ్యం వెంకటేశ్వర్లు, గరికపాటి వెంకట్, బలుగూరి సీతరామయ్య పాల్గొన్నారు.

పిడుగురాళ్ల: తన కవిత్వంతో సమాజాన్ని మేలుకొల్పిన వ్యక్తి గుర్రం జాషువా అని మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము ముక్కంటి అన్నారు. పట్టణంలోని గుర్రం జాషువా విగ్రహం వద్ద గుర్రం జాషువా కళా సమితి అధ్యక్షుడు చల్లగుండ్ల సంతోషరావు ఆధ్వర్యంలో గుర్రం జాషువా 53వ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనగారిన వర్గాల కోసం ఎన్నో పాటలు, కవితలు, గేయాలను రాసి ప్రజలను మేలుకొల్పారని ఆయన తెలియజేశారు. ఆయనను నేటి యువతరం ఆదర్శంగా తీసుకుని ముందుకు నడవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ పసుపులేటి ఆనంద్, వైఎస్సార్ సీపీ పిడుగురాళ్ల పట్టణ అధ్యక్షులు మందా సుధీర్, డేగల అబ్రహాం, సంద్రపాటి నగేశ్వరరావు, పల్లి ప్రేమానందం, కె. కోటేశ్వరరావు, ఆర్. ఇస్రాయేలు, వి. కోటేశ్వరమ్మ, సంద్రపాటి సుధాకర్, లాజరస్, పి. అనిల్, పి. కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య యువజన ప్రతినిధులకు సన్మానం



సన్మానం అందుకున్న ఆర్యవైశ్య యువజన ప్రతినిధులు

కారెంపూడి: రాష్ట్ర ఆర్యవైశ్య యువజన సంఘంలో వివిధ హోదాల పదవులకు కారెంపూడి నుంచి ఎంపికైన ప్రతినిధులను మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సోమవారం సన్మానించారు. భవిరిశెట్టి రామారావు, ఆత్మకూరి శివరామకృష్ణ, చలువాది మాధవ, ముచ్చర్ల రామకోటేశ్వరరావు, సూరె వెంకట నాగసుబ్రమణ్యం, సన్నిధి వెంకట జగన్ మోహన్‌రావు, గుండా వెంకట ఉమామహేశ్వర రావు, సూరె ఆంజనేయులు, కాసుల చలమయ్య, వెంపటి రామాంజనేయులు, సముద్రాల సాయి, సూరె వెంకటనాగేశ్వరరావు, గజవెల్లి సాయిచంద్‌లను అభినందించారు. రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ప్రధాన కార్యదర్శి సాధు ప్రతాప్, సేవా దళ్ రాష్ట్ర ప్రతినిధి బిజినేపల్లి శరత్ చేతుల మీదగా వారిని సన్మానించారు. మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వెలుగూరి శ్రీనివాసరావు, నగరేశ్వరస్వామి దేవాలయ ధర్మకర్త మిత్తింటి సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుతాఘాతానికి గురై రెండు గేదెలు మృతి



విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మృతి చెందిన రెండు గేదెలు

పాలువాయిగేటు(రెంటచింతల): మండలంలోని పాలువాయిగేటు గ్రామ శివార్లో ఉన్న పంటపొలంలో విద్యుత్ ఘాతానికి గురై రెండు గేదెలు మృతి చెందిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన జవిశెట్టి శ్రీనివాసరావుకు చెందిన గేదెలు పశుగ్రాసం(మేత)కోసం గ్రామ సమీపంలో ఉన్న పొలంలోకి వెళ్ళాయి. పొలంలో ఏర్పాటు చేసిన విద్యుత్ ఏజిఎల్ ట్రాన్స్‌ఫార్మర్‌కు ఉన్న ఎర్త్‌వైర్‌కు విద్యుత్ ప్రసరణ కావడంతో మేత మేస్తున్న గేదెలు రెండు ఎర్త్‌వైర్‌ను తగలడంతో విద్యుత్ ఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందినట్లు బాధితుడు శ్రీనివాసరావు తెలిపారు. మృత్యువాతపడిన రెండు సూడు గేదెల విలువ సుమారు రూ.1.20 లక్షలు ఉంటుందన్నారు. వెంటనే ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్‌వైర్ వల్ల గేదెలు మృతిచెందిన విషయాన్ని విద్యుత్ సిబ్బందికి గ్రామ ఇన్‌చార్జి సర్పంచ్ చింతా సుబ్బారావు సమాచారం అందించారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రైతులు పొలంబాట పడుతున్న సమయంలో పంటపొలాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లును, నేలకు ఒరిగిన స్తంభాలను పరిశీలించాలని విద్యుత్ సిబ్బందిని ఆయన కోరారు.

పంట నమోదుపై మండల స్థాయి సదస్సు



సమావేశంలో పాల్గొన్న తహసీల్దార్ రమేష్ కుమార్, ఏఓ అమీర్‌రెడ్డి

దుర్గి: ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రైతులు తమ పొలాల్లో వేసిన పంటను ఖచ్చితంగా ఈ క్రాప్ నమోదు చేసుకోవాలని మండల తహసీల్దార్ ఎం రమేష్ కుమార్, ఏఓ అమీర్‌రెడ్డిలు తెలిపారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పంట నమోదు పై వీఆర్‌ఓలు, వ్యవసాయ శాఖ సిబ్బందితో కలిసి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంకా మిగిలిపోయిన కౌలు రైతులు సీసీఆర్సీ కార్డులను వారికి అందే విధంగా రెవెన్యూ, వ్యవసాయ శాఖ సిబ్బంది చర్యలు తీసుకోవాలని కోరారు. రైతులతో పాటు కౌలు రైతులూ తప్పనిసరిగా పంటలను నమోదు చేసుకోవాలని రైతులను కోరారు. మండల పరిధిలోని రైతులందరూ స్థానిక రైతు భరోసా కేంద్రాల్లో తమ వివరాలను తెలపాలని వివరించారు. కార్యక్రమంలో వీఆర్‌ఓ రంగారావు, కోటేశ్వరరావు, సునీత, గంగమ్మ, కిరణ్, విహెచ్ఎలు రాఘవ, కోటేశ్వరరావు, విఏఎలు అశోక్, మల్లిఖార్జున, తులసీనాయక్ పలువురు పాల్గొన్నారు.

నర్సరీ చట్టం నిబంధనలు పాటించాలి

హెచ్ఓ మోహన్



నర్సరీలను పరిశీలించి సూచనలు ఇస్తున్న గురజాల ఉద్యానశాఖ అధికారి మోహన్

రెంటచింతల: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యానశాఖ ద్వారా అందించే సబ్సిడీతో నర్సరీ(షేర్‌నెట్)లను ఏర్పాటు చేసుకునే నిర్వాహకులకు(యజమానులు) నర్సరీ చట్టం(2010) నియమనిబంధనలు తప్పనిసరిగా పాటించాలని గురజాల ఉద్యానశాఖ అధికారి వై.మోహన్ అన్నారు. సోమవారం రెంటచింతలలో ఉన్న నర్సరీలను ఆయన సందర్శించి నిర్వాహకులకు మిర్చినారు పెంపకంపై, షేర్ నెట్ వలన కలుగు ప్రయోజనాలపై పలు సూచనలు చేశారు. నర్సరీ రిజిస్ట్రేషన్ కోసం పాటించవల్సిన నియమ నిబంధనలను వివరించారు. దరఖాస్తు ఫారం ఎ,రూ.1000ల చలాన(బ్యాంక్ వివరాలు), పట్టాదారు, లీజ్‌కాపీ పాస్ పుస్తకం నఖలు, కౌలు కరారు నమూనా, నర్సరీ నమూనా, భూసారా, నీరు నమూనా పత్రాలను రిజిస్ట్రేషన్ కోసం అధికారులకు ఇవ్వాల్సి ఉందన్నారు. మిరప విత్తనాలను పోట్రేలలో నాటి వాటిని ఎత్తైన మడులపై అమర్చాలన్నారు. కోకో పీట్‌ను ఒక కేజీ ట్రికోడెర్మావిరిడి, ఒక కేజీ సూడోమోనాస్‌తో శుద్ధి చేసుకోవాలన్నారు. పోట్రేలలో శుద్ధి చేసిన కోకో పీట్‌ను మాత్రమే వినియోగించాలన్నారు. ఉద్యానశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్టాక్ రిజిస్టర్, ప్రొడక్షన్ అండ్ సెల్స్ రిజిస్టర్, నర్సరీ మెయింటినెన్స్ రికార్డుల్లో మొక్కల పెంపకం, క్రయవిక్రయాలకు సంబంధించిన పూర్తి వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని మొత్తం 7 రికార్డులను మెయింటైన్ చేయాలన్నారు. రైతులకు వారు అడిగిన నారును మాత్రమే అందజేయాలని...నాసిరకం నారును విక్రయించిన, అధిక ధరలకు విక్రయించిన నర్సరీ యజమానులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. అనుమతి లేకుండా మిర్చినారును విక్రయించిన శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. మొక్కలను విక్రయించే సమయంలో ప్రతి రైతుకు తప్పనిసరిగా బిల్లు ఇవ్వాలని అందులో విత్తనం రకం, కంపెనీ పేరు, లాటు నెంబర్, మొక్కల సంఖ్య, ధరను నమోదుచేయాల్సి ఉందన్నారు. నర్సరీల నిర్మాణ, నిర్వహణ సమయాలలో ఉద్యానశాఖ అధికారుల సూచనలు, సలహాలు తీసుకున్నట్లు అయితే తక్కువ ఖర్చుకే రైతులకు ప్రభుత్వ గుర్తింపు పొందిన వివిధ రకాల నాణ్యమైన హైబ్రిడ్ మిర్చి మొక్కలను అందించవచ్చు నన్నారు. ఆయన వెంట వీఏఎలు తిరుపతినాయక్, శంకర్‌నాయక్, పవన్ కుమార్, నర్సరీ నిర్వాహకులు ఉన్నారు.

ప్రకృతి సేవలో విద్యార్థులు



కారెంపూడి: జూలకల్లు ప్రాథమిక పాఠశాల విద్యార్థులు రెండు వేల విత్తన బంతులు (సీడ్ బాల్స్) తయారు చేసి వాటిని కారెంపూడికి చెందిన ప్రకృతి ప్రేమికుడు కొమెర అంకారావు (జాజి)కి సోమవారం అందజేశారు. వాటితో పాటు సేకరించిన మరో 10 వేల కానుక విత్తనాలను కూడా అందించారు. పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు కొమెర జాజిని పాఠశాలకు ఆహ్వానించి ప్రకృతి సేవకు తమ వంతుగా వీటిని ఆయనకు అందించారు. పల్నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ ఇటీవల నల్లమలలో విత్తన బంతులు చల్లి పర్యావరణం ఇబ్బందుల్లో ఉందని పర్యావరణ పరిరక్షణపై అందరూ దృష్టి సారించాలని ఇచ్చిన పిలుపు మేరకు జాజి చేస్తున్న కృషికి వారు చేయూతగా విత్తనాలు, సీడ్ బాల్స్ అందించారు.

జగనన్న సురక్ష రాష్ట్ర ప్రజలకు ఒక వరం



సర్టిఫికెట్‌ను పంపిణీ చేస్తున్న ఎంపీపీ దాసరి చౌడేశ్వరి, అధికారులు



ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ఎంపీపీ మేకల, జెడ్పీటీసీ షఫీ, తహసీల్దార్, ఎంపీడీఓ

ఎంపీపీ దాసరి చౌడేశ్వరి

రెంటచింతల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన జగనన్న సురక్ష కార్యక్రమం రాష్ట్ర ప్రజలకు ఒక వరమని ఎంపీపీ దాసరి చౌడేశ్వరి అన్నారు. సోమవారం మండల కేంద్రమైన రెంటచింతల గ్రామంలోని సచివాలయం–11 వద్ద సర్పంచ్ పూజల పుష్పావతి రామయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. నేరుగా ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్క రించేందుకు సీఎం జగన్ చిత్తశుద్ధితో ప్రారంభించిన 1902 జగనన్నకు చెబుదాం కార్యక్ర మానికి రాష్ట్ర ప్రజల నుంచి అపూర్వస్పందన లభించిందని, దానికి అనుసంధానమే ఈ జగనన్న సురక్ష అని అన్నారు. సీఎం జగన్ నేతృత్వంలోని ప్రభుత్వ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అందించి వారికి మేలు చేయడమేకాకుండా వారు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకుని వాటిని అక్కడికక్కడే పరిష్కరించడం జరుగుతుందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రారంభించిన విప్లవాత్మ కమైన ఈ కార్యక్రమం ద్వారా గ్రామాల్లోనే 11 రకాల సేవలను ఉచితంగా అందించి ధృవీకరణ పత్రాలను అందజేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు కులం, ఆదాయం, రైస్ కార్డు, ఆరోగ్య శ్రీ కార్డు కోసం మండల కేంద్రానికి తిరిగిన వివిధ గ్రామస్తులు ఇప్పటి నుంచి వారివారి గ్రామాల లోనే అందజేయనున్నట్లు తెలిపారు. అనంతరం వివిధ రకాల సేవలకోసం, పథకాల కోసం దరఖాస్తు చేసుకున్న 65 మంది లబ్ధిదారులకు ధృవీకరణ పత్రాలను అందజేశారు. కార్యక్రమలో సర్పంచ్ పూజల పుష్పావతి



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న ఎంపీడీఓ సమతావాణి

రామయ్య, తహసీల్దార్ కట్టేకోట పుల్లారావు, వైఎస్ ఎంపీపీ ఏరువ శౌర్రెడ్డి, పార్టీ రాష్ట్ర యువజన నాయకులు మోర్త ఉమ, ఏఓ బోయపాటి బ్రహ్మారెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ పమ్మి సీతారామిరెడ్డి, ఈఓపీఆర్డీ సీహెచ్ రామచంద్రరావు, ఆర్‌డబ్ల్యూస్ ఏఈ కొత్తా నరేంద్రారెడ్డి, హౌసింగ్ ఏఈ శ్రీనివాసరావు, ఎంపీటీసీ గాలి ప్రతాప్‌రెడ్డి, కార్యదర్శి జి.అనంత కోటేశ్వరరావు, సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

కారెంపూడి: మిగిలి ఉన్న ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కారం చేయడం కోసమే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తోందని, ఈ కార్యక్రమం ప్రజల సమస్యల పరిష్కారంపపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికున్న చిత్తశుద్ధికి నిదర్శనమని ఎంపీపీ మేకల శారదాశ్రీనివాసరెడ్డి, జెడ్పీటీసీ షేక్ షఫీ పేర్కొన్నారు. కారెంపూడి గ్రామ సచివాలయం 1 పరిధిలో సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా గ్రామ సభలో ప్రజా ప్రతినిధులు మాట్లాడారు. గ్రామ సభ అనంతరం ప్రజల నుంచి వచ్చిన అర్జీలను అధికారులు పరిష్కారం చేశారు. అర్జీదారులకు వెంటనే వివిధ ధ్రువీకరణ పత్రాలను అధికారులు పంపిణీ చేశారు. మొత్తం 373 అర్జీలు వివిధ ధ్రువీకరణ పత్రాల కోసం మంజూరయ్యాయి. వాటిలో తక్షణం పరిష్కారం అయ్యే సమస్యలన్నింటిని అధికారులు పరిష్కరించారు. వెంటనే గ్రామ సర్పంచ్ రమావతు ప్రమీలా భాయి తేజానాయక్, ఎంపీపీ శారదాశ్రీనివాస రెడ్డి, జెడ్పీటీసీ షఫీ, జిల్లా వక్ఫ్ బోర్డ్ చైర్మన్ షేక్ అక్బర్, తహసీల్దార్ జి శ్రీనివాస్, ఎంపీడీఓ జి శ్రీనివాసరెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ అల్లు వెంకటేశ్వరరెడ్డి, ఈఓపీఆర్డీ పి సత్యప్రసాద్, ఎంపీటీసీలు బొమ్మిన సావిత్రిఅల్లయ్య, అంతరగడ్డ ఏసోబు, వేముల పద్మలింగయ్య, షేక్ ఆరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం విజయవంతంగా కొనసాగిందని గ్రామస్తులు తమకు అవసరమైన పత్రాలు పొంది ఆనందం వ్యక్తం చేయడం సంతోషంగా ఉందని తహసీల్దార్ ఎం రమేష్‌కుమార్, ఎంపీడీఓ కె సమతావాణిలు అన్నారు. సోమవారం పోలేపల్లిలో స్థానిక సచివాలయం వద్ద జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంతో పాటు తేరాల గ్రామస్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు పొందేందుకు ధృవపత్రాలు తప్పనిసరి అని, వాటిని అనివార్య కారణాలతో పొందని వారి గురించి ఉచితంగా పత్రాలు అందజేయడం జరిగిందన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలన్నారు. 160 ధృవపత్రాలను స్థానిక ప్రజా ప్రతినిధుల చేతుల మీదుగా అధికారులు అందజేశారు. వివిధ సాంకేతిక కారణాల వల్ల పత్రాలు పొందిన అర్జీదారులు తమ గ్రామానికి వచ్చి అధికారులు ధృవపత్రాలను అందజేయటం పట్ల గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎఓ అమీర్‌రెడ్డి, ఈఓపిఆర్‌డి జిఎల్ఎన్ గుప్తా, ఎపిఓ జి వెంకటేశ్వరరావు, సర్పంచ్‌లు దేశం శ్రీనివాస రెడ్డి, చౌకాల బ్రహ్మయ్య, ఎంపీటీసీ, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్వాయి అంజిరెడ్డి, గొరెడ్డి వెంకటరెడ్డి, పుచ్చకాయల రామకృష్ణ, తేరాల మాజీ సర్పంచి కొండలు, పలువురు అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

మొహర్రం వేడుకలు ఆరంభం



ప్రత్యేక అలంకరణలో పీర్లు



పీర్ల చావిడిలలో అలంకరణలో పీర్లు

శావల్యాపురం: మండల కేంద్రంలో మొహర్రం వేడుకలు ప్రారంభమయ్యాయి. పీర్ల సవాడిలో పీర్లను ముస్తాబు చేసి ప్రత్యేక పూజలు చేపడుతున్నారు. మంగళవారం సాయంత్రం చిన సరిగత్ సందర్భంగా అత్యంత భక్తి శ్రద్ధలతో పీర్లు ఎత్తుకొని నిప్పుల గుండల్లో నడవటం అనవాయితీగా వస్తోంది. ఈనెల 28న పెద సరిగత్ వేడుకల సందర్భంగా నిప్పుల గుండలో నడిచి అనంతరం గ్రామ పురవీధుల్లో పీర్లును సూర్యదయం వరకు మేళాలతో ఉరేగిస్తారు. చివరిరోజు ఈనెల 29న సాయంత్రం 3 గంటల నుంచి సంప్రదాయ మేళాతాళాలు కనకతప్పట్లు నడుమ పీర్లును గ్రామపురవీధుల్లో ఉరేగింపుతో అనంతరం పండుగ వేడుకలు ముగుస్తాయని పీర్ల నిర్వాహకులు తెలిపారు. కులమతాలకు అతీతంగా వేడుకలు జరపటం విశేషం. ముస్లిం సోదరులు పీర్లును అలంకరణ చేసి నూరుబాష సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక దువా నిర్వహించారు. మొహర్రం సందర్భంగా పీర్ల సవాడిని విద్యుత్ కాంతులతో ముస్తాబు చేశారు.

రొంపిచర్లలో....

రొంపిచర్ల: మండలంలోని విప్పర్ల, సంతగుడిపాడు, రొంపిచర్ల, మునమాక, అన్నవరం, కొత్తపల్లి, ఎడ్వర్డ్‌పేట గ్రామాల్లో మొహరం వేడుకలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పీర్లచావిడిలలో పీర్లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. ఐదో సర్గత్‌ను పురస్కరించుకొని ఆదివారం రాత్రి నుండే వేడుకలు ప్రారంభమయ్యాయి. ఆరో సర్గత్‌ను పురస్కరించుకొని సోమవారం పీర్ల చావిడిలలో అలంకరణ, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. విప్పర్లపల్లి గ్రామంలో ముస్లిం యువకులు పెద్దపులి, వేటగాడు వేషధారణతో డప్పు, వాయిద్యాల మధ్య సందడి చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

నరసరావుపేట టౌన్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందిన ఘటన పట్టణంలోని బరంపేటలో సోమవారం చోటు చేసుకుంది. ఇస్సప్పాలెంకి చెందిన కాపులపల్లి సత్యనారాయణరెడ్డి ద్విచక్ర వాహనంపై బరంపేట వస్తుండగా కేఏస్ఆర్ ఫంక్షన్ ప్లాజ్ సమీపంలో కుక్క అడ్డు రావడంతో తప్పించబోయి ప్రమాదంలో మృతి చెందాడు.